శుక్రవారం 30-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 440 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM

SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com



## హైడ్రా పేరుతో అవినీతికి పాల్పడితే చర్యలే

### తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ముందడుగు తెలంగాణ:

అక్రమ నిర్మాణాలపై కొరడా ఝులిపిస్తున్న హైడ్రా పేరు చెప్పి కొందరు అవినీతికి పాల్పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. గతంలో ఇచ్చిన నోటీసులను అడ్డుపెట్టుకొని డబ్బులు అడుగుతున్నట్లు తెలిసిందన్నారు. అమాయకులను భయపెట్టి డబ్బు వసూలు చేస్తున్నారని, కొన్ని చోట్ల రెవెన్యూ, మున్సిపల్, ఇరిగేషన్ అధికారులపై కూడా ఫిర్యాదులు వచ్చాయని సీఎం చెప్పారు. అక్రమంగా డబ్బు వసూలు చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వసూళ్లకు పాల్పడే వారిపై దృష్టి పెట్టాలని ఏసీబీ, విజిలెన్స్ అధికారులను సీఎం ఆదేశించారు.

### తెలంగాణ సహా 7 రాష్ట్రాల్లో

## ఎన్ఐఏ సోదాలు

### కీలక సమాచారం ఉన్న దస్త్రాలను స్వాధీనం




ముందడుగు జాతీయం:

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో గురువారం సోదాలు చేపట్టింది. భారత్‌లో గూఢచర్యానికి పాల్పడేందుకు పాక్ ఏజెంట్ల నుంచి డబ్బులు అందుకున్నట్లు అనుమానిస్తున్న వ్యక్తుల నివాసాల్లో ఎన్ఐఏ బృందాలు ఈ సోదాలు చేపట్టినట్లు తెలిపింది. రక్షణశాఖ రహస్యాలను చేరవేసే కేసుకు సంబంధించి తెలంగాణ, గుజరాత్, కర్ణాటక, కేరళ, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, హరియాణా రాష్ట్రాల్లోని 16 చోట్ల విస్తృత సోదాలు చేపట్టాం'' అని ఎన్ఐఏ ప్రకటనలో వెల్లడించింది. 22 మొబైల్ ఫోన్లు, కీలక సమాచారం ఉన్న దస్త్రాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. భారత నౌకాదళానికి చెందిన కీలక సమాచారాన్ని తెలుసుకునేందుకు శత్రుదేశం పన్నిన కుట్ర 2021లో వెలుగు చూసింది. ఈ గూఢచర్యం కేసులో ఐఎస్ఐ ఏజెంట్ల హస్తం ఉన్నట్లు గుర్తించిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అనంతరం 2023లో ఈ కేసు ఎన్ఐఏకి చేరింది. దీంట్లో పాకిస్థానీ ఐఎస్ఐ హస్తం ఉన్నట్లు తేలింది. ఈ కేసులో ఇప్పటికే పలు అనుబంధ ఛార్జిషీట్లు కూడా దాఖలు చేసింది.




భారతదేశంలో యూనివర్శిటీ ఆఫ్ సౌతాంప్టన్ క్యాంపస్

మిగతా 2లో



ఆరుగురు అధికారులపై హైడ్రా క్రిమినల్ కేసులు

మిగతా 2లో



మహిళకు కన్ను కొట్టినందుకు రూ.15,000 ఫైన్

మిగతా 3లో




పామ్ ఆయిల్‌తో ఆరోగ్య ప్రయోజనాలు..

మిగతా 4లో

### భారత కుబేరుల జాబితాలో

## అదానీ అగ్రస్థానం

### ముకేశ్ అంబానీని దాటేసి తొలి స్థానంలోకి




ముందడుగు జాతీయం:

అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ భారత అపర కుబేరుల జాబితాలో అగ్ర స్థానంలో నిలిచారు. రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీని దాటేసి తొలి స్థానం దక్కించుకున్నారు. ఈమేరకు హురూన్ ఇండియా రిచ్ లిస్ట్‌ను వెలువరించింది. గత ఐదేళ్లుగా దేశంలో బిలియనీర్లు పెరుగుతున్నారని నివేదిక పేర్కొంది. దేశంలో మొత్తం 334 మంది మిగతా 2లో

## 22 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలే

- మోసం చేయడం రేవంత్‌కు అలవాటే
- బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు

ముందడుగు హైదరాబాద్:



తెలంగాణలో రుణమాఫీ చేయకుండా ప్రజలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేస్తున్నారని బిఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. రుణమాఫీ పూర్తిగా కాలేదని మంత్రులే చెబుతున్నారని, వ్యవసాయశాఖ మంత్రి లెక్క ప్రకారం 22 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని చెప్పారు. రైతులనే కాదు, రాహుల్ గాంధీని కూడా రేవంత్ మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మీడియాతో మిగతా 2లో

ముందడుగు
శుక్రవారం, 30-08-2024, హైదరాబాద్

# రెండు నెలల పాటు జీతభత్యాలు వద్దు

## సీఎం, మంత్రులు కీలక నిర్ణయం



ముందడుగు హిమాచల్ ప్రదేశ్: హిమాచల్ ప్రదేశ్ ప్రకృతి విపత్తుతో అల్లకల్లమయింది. ఆ రాష్ట్రానికి అండగా నిలిచేందుకు సీఎం, మంత్రులు కీలక నిర్ణయం తీసుకున్నారు. రెండు నెలల పాటు జీతభత్యాలు తీసుకోకూడదని నిర్ణయించుకున్నారు. అందులో చీఫ్ పార్లమెంటరీ సెక్రటరీలు, ఇతర ఉన్నతాధికారులు భాగంకానున్నారు. ఈ ప్రకటన చేసింది హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు. గురువారం అసెంబ్లీలో ఈ మేరకు ఆయన ప్రకటన చేశారు. అధికార, విపక్ష ఎమ్మెల్యేలు కూడా ఈ దిశగా నిర్ణయం తీసుకోవాలని కోరారు.

హిమాచల్ ప్రదేశ్ భారీ వర్షా లు, ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటంతో అల్లకల్లోలమైంది. ఆగస్టు నెలలో కులు, మండి, శిమ్లా జిల్లాల్లో కురిసిన వర్షా ల కారణంగా సంభవించిన వరదల్లో సుమారు 30 మంది ప్రాణాలు కోల్పోయారు. పలువురి ఆచూకీ గల్లంతైంది. జూన్ 27 నుంచి ఆగస్టు 9 మధ్యలో 100 మంది మృతి చెందారు. బ్రిడ్జ్‌లు, రోడ్లు, పలు నిర్మాణాలు దెబ్బతిన్నాయి. దాంతో రోజువారీ కార్యకలాపాలతో పాటు పర్యటకంపై ప్రభావం పడింది.

# 22 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలే

(మొదటిపేజీ తరువాయి)

సీఎం చేసేది చిట్‌చాట్ కాదని.. చీట్ చాట్ అని విమర్శించారు. లేనివి ఉన్నట్లు చెప్పి మోసం చేయడం రేవంత్‌కు అలవాటేనని మండిపడ్డారు.
"రుణమాఫీ విషయంలో రేవంత్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. కొండారెడ్డిపల్లి లేదా సిద్దిపేట వెళ్లి రుణమాఫీపై రైతులను అడుగుదాం. ఆగస్టు 15లోగా రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నది నా సవాల్.. చేశారా? రుణమాఫీ సవాల్ ఏమైందో రైతులే చెబుతారు. రుణమాఫీ సభకు రావాలని సీఎం 3 సార్లు ఆహ్వానించినా రాహుల్ రాలేదు. ఆయన రాష్ట్రానికి వస్తే రుణమాఫీపై నిలదీస్తాం" అని హరీశ్‌రావు అన్నారు.

## భారత కుబేరుల జాబితాలో

# అదానీ అగ్రస్థానం

(మొదటిపేజీ తరువాయి)

బిలియనీర్లు ఉన్నారని, ఏడాదిలో 29 శాతం పెరుగుదల నమోదైందని తెలిపింది. అదే సమయంలో చైనాలో వీరి సంఖ్య 25 శాతం మేర తగ్గిందని పేర్కొంది. జులై 31 నాటి గణాంకాలను ఆధారంగా చేసుకొని ఈ నివేదికను రూపొందించింది. హురూన్ ఇండియా వెలువరించిన జాబితాలో రూ.11.61 లక్షల కోట్ల సంపదతో అదానీ అగ్రస్థానంలో నిలిచారు. గత ఏడాదిలో ఆయన సంపద ఏకంగా 95 శాతం పెరిగినట్లు నివేదిక తెలిపింది. రూ.10.14 లక్షల కోట్లతో అంబానీ రెండో స్థానంలో నిలిచారు. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ అధినేత శివ్‌నాడార్, ఆయన కుటుంబం రూ.3.14 లక్షల కోట్లతో మూడో స్థానంలో నిలిచింది. సీరమ్ ఇన్‌స్టిట్యూట్ అధినేత సైరస్ పూనావాలా, సన్‌ఫార్మా అధినేత దిలీప్ సంఘ్వీ నాలుగైదు స్థానాలు దక్కించుకున్నారు. కుమార మంగళం బిర్లా, గోపీచంద్ హిందుజా, రాధాకృష్ణ దమానీ, అజీమ్ ప్రేమ్‌జీ, నీరజ్ బజాజ్ టాప్-10 జాబితాలో నిలిచారు.

## ఆరుగురు అధికారులపై

# హైడ్రా క్రిమినల్ కేసులు

## అక్రమ అనుమతులు ఇచ్చిన అధికారుల జాబితా సిద్ధం



ముందడుగు హైదరాబాద్: ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులపై క్రిమినల్ కేసులకు హైడ్రా సిద్ధమైంది. ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని సైబరాబాద్ కమిషనర్‌కు హైడ్రా సిఫారసు చేసింది. హెచ్‌ఎండీఏలో అక్రమంగా అనుమతులు ఇచ్చిన అధికారుల జాబితాను సిద్ధం చేస్తున్నట్టు సమాచారం.

### అధికారులకు హైడ్రా కొరడా

అక్రమ నిర్మాణదారులకే కాదు.. నిబంధనలకు నీళ్లొదిలిన అధికారులకూ హైడ్రా సెగ తగిలింది. చెరువులను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా పెద్దఎత్తున కూల్చివేయిస్తున్న విషయం తెలిసిందే.
అయితే కూల్చివేతలు చేపట్టిన ప్రాంతాల్లో నాటి నుంచి విధులు నిర్వహించిన సంబంధిత అధికారుల వివరాలను సేకరిస్తున్నట్టు సమాచారం. ఇప్పటివరకు 18 ప్రాంతాల్లో చిన్నా పెద్దవి కలిపి సుమారు 200కి పైగా నిర్మాణాలు కూల్చివేసినట్లు అధికారుల సమాచారం. 50 ఎకరాల వరకు ప్రభుత్వ, చెరువుల భూములను పరిరక్షించినట్లు హైడ్రా అధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ, హెచ్‌ఎండీఏ, రెవెన్యూ అధికారుల పాత్రపై అధికారులు ఆరా తీస్తున్నారు.

## భారతదేశంలో యూనివర్శిటీ ఆఫ్

# సౌతాంప్టన్ క్యాంపస్



ముందడుగు హైదరాబాద్: ప్రపంచంలోని టాప్ 100 విశ్వవిద్యాలయంలో ఒకటిగా గుర్తింపు పొందిన యుకె లోని సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం, భారతదేశంలో తమ సమగ్ర క్యాంపస్‌ను ఏర్పాటు చేయటానికి భారత ప్రభుత్వం నుంచి అనుమతులు పొందిన మొదటి యుకె విశ్వవిద్యాలయంగా అవతరించింది. యూనివర్శిటీ గ్రాంట్స్ కమీషన్ (యుజిసి) ఈ అనుమతులు మంజూరు చేయడం ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. సౌతాంప్టన్ విశ్వవిద్యాలయం అధ్యక్షుడు మరియు వైస్-ఛాన్సలర్ మార్క్ ఇ. స్మిత్ మాట్లాడుతూ “21వ శతాబ్దంలో, భారతదేశంతో సంబంధం ఏర్పరుచుకోకుండా ఏ విశ్వవిద్యాలయం నిజంగా ప్రపంచవ్యాప్తం కాదు. భారతదేశానికి మరియు విశ్వవిద్యాలయానికి సామాజిక విలువ మరియు ఆర్థిక ప్రభావాన్ని అందించే క్యాంపస్‌ను ఏర్పాటు చేయడం మా లక్ష్యం. ప్రపంచవ్యాప్తంగా సూపర్ పవర్ గా ఎదుగుతున్న భారతదేశం లోని ప్రతిభావంతులతో సౌతాంప్టన్ యొక్క ప్రపంచ స్థాయి కార్యకలాపాలను విద్య, పరిశోధన మరియు విజ్ఞాన మార్పిడి మరియు వ్యాపార రంగంలో తీసుకువస్తుంది అని అన్నారు.

## పని ప్రదేశంలో మహిళ లైంగిక వేధింపుల

# పరిష్కారానికి షీ-బాక్స్ పోర్టల్




ముందడుగు ఢిల్లీ: పని ప్రదేశంలో జరిగే లైంగిక వేధింపులకు సంబంధించి ఫిర్యాదులు, వాటి పరిష్కారాలకు షీ- బాక్స్ పోర్టల్‌ను కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి శాఖ మంత్రి అన్నపూర్ణ దేవీ ప్రారంభించారు. ఉపయోగపడుతోందని ఆమె పేర్కొన్నారు. అదేవిధంగా భారత ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా రూపొందించిన మంత్రిత్వశాఖ వెబ్‌సైట్‌ను ఈ సందర్భంగా ఆమె ప్రారంభించారు.

### ఏమిటీ షీ- బాక్స్ పోర్టల్..

అధికారిక ప్రకటన ప్రకారం.. షీ- బాక్స్ పోర్టల్ దేశవ్యాప్తంగా ఏర్పాటు చేసిన అంతర్గత కమిటీ (ICs), స్థానిక కమిటీలల్లోని (LCs) ప్రభుత్వ, ప్రైవేటు రంగాలకు అనుసంధానమై ఉంటుంది. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు గురైన బాధితులు షీ- బాక్స్ పోర్టల్‌లో ఫిర్యాదులు చేయవచ్చు. అంతేకాకుండా ఫిర్యాదుకు సంబంధించిన పరిష్కార స్టేటస్‌ను పరిశీలించుకోవచ్చు. పోర్టల్‌కు నియమించే నోడల్ అధికారి ఫిర్యాదుకు సంబంధించిన పరిష్కారాన్ని పర్యవేక్షిస్తుంటారు. ఫిర్యాదు చేసేందుకు https://shebox.wcd.gov.in/ వెబ్‌సైట్‌కి వెళ్లాలి. అందులో ఫిర్యాదు నమోదును ఎంచుకుని నమోదు చేయాలి.

ముందడుగు
శుక్రవారం, 30-08-2024, హైదరాబాద్

# కార్డు లేకుండానే నగదు డిపాజిట్

- యూపీఐ సాయంతో అకౌంట్‌లోకి నగదు
- త్వరలో అమల్లోకి రానున్న సదుపాయం




ముందడుగు జాతీయం: నగదు డిపాజిట్ విషయంలో మరో కొత్త సదుపాయం అందుబాటులోకి రానుంది. ఏటీఎం కేంద్రాల్లో ఇప్పటి వరకు క్యాష్ డిపాజిట్ మెషిన్లలో సొమ్ములు డిపాజిట్ చేయాలంటే డెబిట్ కార్డు లేదా ఖాతా నెంబరు తప్పనిసరి. ఇకపై అలాంటి అవసరం లేకుండానే యూపీఐ సాయంతో అకౌంట్‌లోకి నగదు డిపాజిట్ చేసే సదుపాయం త్వరలో రానుంది. యూపీఐ ఇంటరాపరేబుల్ క్యాష్ డిపాజిట్‌గా పిలిచే ఈ సేవల్ని గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ టీ రవిశంకర్ గురువారం ఆవిష్కరిచారు. ఈ మేరకు నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఎన్‌పీసీఐ ప్రకారం.. యూపీఐ-ఐసీడీ సాయంతో బ్యాంకులు, వైట్‌లేబుల్ ఆపరేటర్లు నిర్వహించే ఏటీఎం కేంద్రాల వద్ద డెబిట్ కార్డు అవసరం లేకుండా నగదును డిపాజిట్ చేయొచ్చు. సొంత బ్యాంక్ అకౌంట్‌లో గానీ, ఇతరుల బ్యాంక్ అకౌంట్‌లో గానీ ఈ నగదును జమ చేయొచ్చు. మొబైల్ నంబర్‌తో అనుసంధానం అయిన యూపీఐ, వర్చువల్ పేమెంట్ అడ్రస్, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ వీటిల్లో ఏదైనా ఒకటి ఎంటర్ చేసి నగదు జమ చేయొచ్చు. ఈ కొత్త సదుపాయం ప్రస్తుతం అందుబాటులో ఉన్న కార్డ్‌లెస్ క్యాష్ విత్‌డ్రా సదుపాయం లాంటిదేనని నిపుణులు చెబుతున్నారు. దశలవారీగా బ్యాంకులు ఈ సేవల్ని అందుబాటులోకి తీసుకురానున్నాయని ఎన్‌పీసీఐ పేర్కొంది.

# మహిళకు కన్ను కొట్టినందుకు రూ.15,000 ఫైన్

## బాంబే హైకోర్టు సంచలన తీర్పు



ముందడుగు మహారాష్ట్ర: మనదేశంలో మహిళల రక్షణ కోసం ఎన్నో చట్టాలు వచ్చాయి. మహిళవైపు అనుమానాస్పదంగా చూడటం, మహిళను చెడు ఉద్దేశంతో పేరు పెట్టి పిలవడం వంటివి కూడా నేరాలే. మహిళలు వేసుకున్న డ్రెస్ గురించి, డ్రెస్ కలర్ గురించి మాట్లాడటం కూడా తప్పే. ఇలా చట్టాల్లో చాలా అంశాలు ఉండాయి. కానీ అవి అమలవ్వడం అరుదు. చట్టాలు సరిగా అమలు చెయ్యకపోతే, చట్టం ఉంది అనే విషయాన్ని ప్రజలు మర్చిపోతారు. ఫలితంగా నేరాలు ఆగవు.

ఓ వ్యక్తి మహిళకు కన్నుకొట్టాడు. అతనికి బాంబే హైకోర్టు రూ.15,000 ఫైన్ వేసింది. మహ్మద్ కైఫ్ ఫకీర్ అనే వ్యక్తి, ఓ మహిళను అసభ్యంగా తాకడమే కాకుండా.. కన్నుకొట్టాడు. వెంటనే చెంప చెళ్లుమనిపించాలనుకున్న ఆమె అలా చెయ్యలేకపోయింది. కానీ ధైర్యంగా పోలీసులకు ఫిర్యాదు ఇచ్చింది. ఈ కేసు క్రమంగా కోర్టుకు వెళ్లింది. కోర్టులో విచారణ జరిగింది. విచారణలో ఫకీర్ దోషి అని కోర్టు తేల్చింది. దాంతో.. కన్ను కొట్టినందుకు, అసభ్యంగా తాకినందుకు.. ఓవరాల్‌గా మహిళతో అగౌరవంగా ప్రవర్తించినందుకు అతనికి రూ.15,000 జరిమానా వేసింది. దేశవ్యాప్తంగా రోజూ లక్షల మంది మహిళలతో చాలా మంది అనుచితంగా ప్రవర్తిస్తున్నారు. వారంతా కేసులు పెట్టట్లేదు కాబట్టి.. అక్రమార్కులకు ఫైన్లు పడట్లేదు. అదే జరిగితే, ఈ వార్త కామన్ అయ్యేది. కానీ అలా జరగట్లేదు కాబట్టే.. ఈ వార్త వైరల్ అయ్యింది.

# భారతదేశంలో ఆర్థిక సలహా ల్యాండ్‌స్కేప్‌లోకి అడుగుపెట్టిన బ్యాంకర్స్ క్లబ్



ముందడుగు హైదరాబాద్: అనుభవజ్ఞులైన బ్యాంకర్‌లతో వినూత్నమైన ఫిన్‌టెక్ స్టార్ట్-అప్ బ్యాంకర్స్‌క్లబ్‌ను టెక్-ఎనేబుల్డ్ అగ్రిగేటర్ ప్లాట్‌ఫారమ్ ద్వారా అందుబాటులోకి తీసుకువచ్చి ఆర్థిక సలహాలను పునర్నిర్వచించేందుకు సిద్ధమైంది. ఇది చిన్న వ్యాపారాలు, ఎంఎస్ఎంఈలు మరియు స్టార్టప్‌లను రిటైర్డ్ బ్యాంకర్లతో అనుసంధానం చేయడం ద్వారా విస్తృత శ్రేణి వ్యూహాత్మక కార్పొరేట్ ఆర్థిక సలహా సేవలు, పరిష్కారాలను మరింత సరళం చేస్తుంది.

దీన్ని ప్రారంభించిన కార్యక్రమంలో ప్రముఖ ఆర్థికవేత్త మరియు పంజాబ్ అండ్ సింధ్ బ్యాంక్ ఛైర్మన్ డాక్టర్ చరణ్ సింగ్ మాట్లాడుతూ, "రిటైర్డ్ బ్యాంకర్లను తిరిగి నియమించడం, వారి రిటైర్మెంట్ వయస్సు 60 ఏళ్లు దాటినా వారి బ్యాంకింగ్ మరియు ఆర్థిక నైపుణ్యం సంపదను పరిరక్షించడం మరియు పరపతి పొందడం చాలా కీలకం. బ్యాంకర్స్‌క్లబ్ సంక్లిష్టమైన ఆర్థిక సవాళ్లను నావిగేట్ చేయడంలో వ్యాపారాలకు మద్దతు ఇచ్చే దిశగా ప్రస్తుతం వృధాగా ఉన్న ఈ అమూల్యమైన మానవ మూలధనాన్ని రూపొందించడం ద్వారా, ఇది మన ఆర్థిక వ్యవస్థ వృద్ధికి, స్థిరత్వానికి దోహదపడుతూ అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలకు కావలసిన అవసరాలను తీరుస్తుంది" అని పేర్కొన్నారు.

### అత్యధిక క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తి

# 99.23% నమోదు చేసిన ఎడెల్‌వీస్ లైఫ్

ముందడుగు హైదరాబాద్: కస్టమర్ సెంట్రిసిటీపై తన దృష్టిని సారించిన ఎడెల్‌వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ 2023-24 ఆర్థిక సంవత్సరానికి క్లెయిమ్ సెటిల్‌మెంట్ నిష్పత్తిని 99.23%గా ప్రకటించింది. ఇది కంపెనీ 13 ఏళ్ల చరిత్రలో మొదటిసారిగా ఈ స్థాయిలో క్లెయిమ్ సెటిల్‌మెంట్‌ను చేసింది. ఎడెల్వీస్ లైఫ్ ఇన్సూరెన్స్ మేనేజింగ్ డైరెక్టర్ మరియు సీఈఓ సుమిత్ రాయ్ మాట్లాడుతూ, "క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో అనేది కస్టమర్ సెంట్రిసిటీకి ముఖ్యమైన మార్కర్; ఇది వాస్తవాలతో కూడిన అత్యుత్తమ క్షణం. మీ ప్రియమైన వారికి అవసరమైన సమయంలో, వారితో కంపెనీ నిలబడుతుందా లేదా అనే దాన్ని ఇది సూచిస్తుంది. ఈ మైలురాయి గురించి మేము చాలా గర్విస్తున్నాము. మేము 100% వినియోగదారునికి పెద్ద పీట వేస్తున్నామనేందుకు ఇది రుజువు" అని పేర్కొన్నారు.

ముందడుగు
శుక్రవారం, 30-08-2024, హైదరాబాద్

విదేశాల్లో విద్యాభ్యాసం కోసం

# హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఎడ్‌టెక్ ప్లాట్‌ఫారమ్


HDFC BANK
We understand your world

ముందడుగు హైదరాబాద్:
భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ రంగ బ్యాంకు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నేడు ముంబయిలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2024లో తన ఎడ్‌టెక్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభించామని వెల్లడించింది. ఇది విదేశాలలో విద్యను అభ్యసించే విద్యార్థులకు చెల్లింపు గేట్‌వేగా ఉపయోగపడుతుంది. ఇప్పటికే ఉన్న ఆఫ్‌లైన్ మోడ్‌లో నిధులను విదేశీ బదిలీల నుంచి విదేశీ విద్య చెల్లింపులకు సంబంధించిన చెల్లింపులను డిజిటలైజ్ చేయడంలో ఇది సహాయపడుతుంది.

ఈ సందర్భంలో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ బిజినెస్ హెడ్ మరియు ఇవిపి – రిటైల్ ట్రేడ్ అండ్ ఫారెక్స్ జతీందర్ గుప్త మాట్లాడుతూ, "విదేశాల్లో తమ విద్యా కలలను కొనసాగించాలని కోరుకునే విద్యార్థుల కోసం చెల్లింపుల పరిష్కారం - మా కొత్త ఎడ్‌టెక్ ప్లాట్‌ఫారమ్‌ను ప్రారంభిస్తున్నందుకు మేము సంతోషిస్తున్నాము. ఇది ప్రయాణాన్ని త్వరగా, సాఫీగా చేసేందుకు సహాయపడుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ అందించిన ఆఫర్ కస్టమర్ సెంట్రిసిటీపై మా దృష్టిలో భాగం మరియు మారుతున్న వినియోగదారుల అంచనాలతో పాటు అభివృద్ధి చెందాలనే మా నిబద్ధతకు అద్దం పడుతుంది" అని వివరించారు.

# మార్కెట్‌లోకి విడుదలైన పోకో ప్యాడ్5G

ముందడుగు హైదరాబాద్:
భారతదేశ వినియోగదారు సాంకేతిక రంగంలో వేగవంతమైన వృద్ధికి పర్యాయపదంగా ఉన్న పోకో బ్రాండ్, నేడు భారతదేశంలో పోకో ప్యాడ్ 5జీ విక్రయాలను ప్రారంభించగా, ఇది ఫ్లిప్‌కార్ట్‌లోమధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైంది. ఈ పరికరంతో, పోకో ఇండియాటాబ్లెట్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. అత్యాధునిక సాంకేతికత, సాటిలేని విలువతోకూడిన దాని సిగ్నేచర్ కలయికతో కొత్త ఉత్పత్తి వర్గంలోకి ప్రవేశించింది. ఈ పోకో ప్యాడ్ 5జీ సౌకర్యవంతమైన పోర్టబిలిటీలో లీనమయ్యే వినోదం కోసం తయారుచేశారు. ఈ పరికరం 2.5K రిజల్యూషన్ మరియు 120Hz అడాప్టివ్సింక్ రిఫ్రెష్ రేట్‌తో అద్భుతమైన విజువల్ అనుభవాన్ని అందిస్తుంది. డాల్బీ విజన్ మరియు డాల్బీఅట్మాస్ కలిగినఇది ప్రయాణంలో వినోదం, ఉత్పాదకతను, సృజనాత్మకతను సంపూర్ణంగా సమతుల్యం చేస్తుంది. స్నాప్‌డ్రాగన్ 7s Gen 2ద్వారా ఆధారితమైన ఈ తదుపరి




తరం ప్యాడ్ 33W ఫాస్టా ్ఛర్జింగ్ మద్దతుతో శక్తివంతమైన 10000 ఎంఏహెచ్ బ్యాటరీని కలిగి ఉంది. ఈ పరికరం పోకో స్మార్ట్ పెన్, పోకో కీబోర్డ్మరియు బ్యాక్ కేస్‌తో వస్తుంది. అదనంగా, పోకో ప్యాడ్ 2సంవత్సరాల ఆండ్రాయిడ్ అప్‌డేట్లను మరియు 3 ఏళ్ల సెక్యూరిటీ అప్‌డేట్లను అందిస్తుంది.



# పామ్ ఆయిల్‌తో ఆరోగ్య ప్రయోజనాలు..

- వెజిటబుల్ ఆయిల్‌గా ప్రపంచ గుర్తింపు
- ప్రాసెసింగ్ చేసిన పోషకాలు నశించవు
- ధర తక్కువ, లాభాలు ఎక్కువ!

ముందడుగు ప్రత్యేకం:
రుచికరమైన వంటకాలకు మనదేశంలో వివిధ రకాల వంట నూనెలను వాడతారు. వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు నూనెలు, రైస్ బ్రాన్ ఆయిల్.. వంటి ఎన్నో రకాలు అందుబాటులో ఉన్నాయి. అయితే పామ్ ఆయిల్‌ను కూడా వంటకాల తయారీకి వాడతారు. ఈ నూనె ఆరోగ్యానికి మంచిది కాదని చాలామంది అనుకుంటారు. కానీ అది పూర్తిగా నిజం కాదు. దీని ధర తక్కువ, ప్రయోజనాలు ఎక్కువ. పామ్ ఆయిల్ హెల్త్ బెనిఫిట్స్ ఏంటో ఒకసారి తెలుసుకుందాం..

పామాయిల్‌ను ఆయిల్ పామ్ చెట్టు పండ్ల నుంచి సేకరిస్తారు. ఈ చెట్లు ఆగ్నేయాసియా, ఆఫ్రికా దేశాల్లో ఎక్కువగా పెరుగుతాయి. పామాయిల్‌ను శాస్త్రీయంగా ఎలాయిస్ గినియాసిస్ అని పిలుస్తారు. దీని స్మోక్ పాయింట్ ఎక్కువ. ఎక్కువ రోజులు నిల్వ చేసుకోవచ్చు. వంటకాల రుచి, ఆకృతిని పెంచే సామర్థ్యం దీని సొంతం. ఆయిల్ పామ్ సాగు చాలా సులభం. ఇది శాశ్వత పంట. ఈ చెట్ల జీవిత కాలం 25 సంవత్సరాల వరకు ఉంటుంది. ఇతర నూనెగింజల పంటలతో పోలిస్తే చాలా తక్కువ భూమి దీని సాగుకు అవసరం. ఈ తోటల పెంపకం ద్వారా మూడు రకాల ప్రైమరీ ప్రొడక్ట్స్ ఉత్పత్తి చేసుకోవచ్చు. దీంట్లో ప్రతి ఒక్కటి ప్రత్యేకమైన ఫ్యాటీ యాసిడ్స్, అప్లికేషన్స్‌తో వస్తుంది.

### క్రూడ్ పామాయిల్

ఆయిల్ పామ్ పండు నుంచి సేకరించే క్రూడ్ పామాయిల్, గది ఉష్ణోగ్రత వద్ద సెమీ సాలిడ్ స్టేట్‌లో ఉంటుంది. అంటే పూర్తిగా లిక్విడ్ మాదిరిగా ఉండదు. న్యూట్రల్ ఫ్లేవర్ ఉంటుంది. అందుకే ఫుడ్ ఇండస్ట్రీలో దీన్ని వాడతారు. వంట నూనె, వనస్పతి, చాక్లెట్, వివిధ ప్రాసెస్ ఫుడ్స్ వంటి ప్రొడక్ట్స్ లో ఇది ముఖ్యమైన ఇంగ్రీడియంట్.

### రిఫైన్డ్, బ్లీచ్డ్, డియోడరైజ్డ్ పామ్ ఆయిల్..

ఇది సిపిఓ ప్రాసెస్డ్ ఫామ్. దీన్ని ఫుడ్ ఇండస్ట్రీలో ఎక్కువగా ఉపయోగిస్తారు. కాస్మెటిక్, ఫార్మాస్యూటికల్స్‌లో కూడా వాడతారు.

### పామ్ కెర్నల్ ఆయిల్..

ఆయిల్ పామ్ పండు విత్తనం నుంచి పామ్ కెర్నల్ ఆయిల్ ను సేకరిస్తారు. దీన్ని కాస్మెటిక్స్, పర్సనల్ కేరింగ్ ప్రొడక్ట్స్ తయారీకి ఉపయోగిస్తారు. ఇది సబ్బులు, షాంపూలు, లోషన్స్ వంటి వాటికి మాయిశ్చరైజింగ్ లక్షణాలను అందిస్తుంది.

### పామాయిల్ బెనిఫిట్స్

- పామాయిల్, ప్రపంచవ్యాప్తంగా ఎక్కువగా ఉపయోగించే వెజిటబుల్ ఆయిల్‌గా గుర్తింపు పొందింది. ఇది మన శరీరానికి ముఖ్యమైన శక్తి వనరుగా పని చేస్తుంది. శరీర కణాలను రక్షిస్తుంది. శుద్ధి చేసిన పామాయిల్ 50-60% విటమిన్లను రిటైన్ చేసుకుంటుంది. అంటే ప్రాసెసింగ్ తర్వాత కూడా పోషకాలు నశించవు. దీంట్లో 70% టోకోట్రినాల్స్ ఉంటాయి. ఇది యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో కూడిన విటమిన్ E. ఈ న్యూట్రియెంట్స్ అనేక రకాల శారీరక విధులకు అవసరం.
- పామాయిల్‌లోని పాలీ అన్‌శాచురేటెడ్ ఫ్యాట్స్, మెదడును డిమెన్షియా నుంచి రక్షిస్తాయి, స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఇవి బ్రెయిన్ ట్యూమర్స్ రాకుండా కాపాడతాయి. కెరోటినాయిడ్స్‌కు పామాయిల్ నేచురల్ సోర్స్. ఇది విటమిన్ Aగా కన్వర్ట్ అవుతుంది. ఈ పోషకం కంటి చూపు, రోగనిరోధక వ్యవస్థకు చాలా ముఖ్యమైనది.
- పామాయిల్‌ను బయో ఫ్యుయెల్ ప్రొడక్షన్‌కు కూడా ఉపయోగిస్తారు. ఇది బయో డీజిల్‌కు ఫీడ్‌స్టాక్‌గా, వాహనాలకు శక్తినిచ్చే పునరుత్పాదక శక్తి వనరుగా పనిచేస్తుంది. ఇతర వంట నూనెలతో పోలిస్తే ఇందులో సంతృప్త కొవ్వులు మధ్యస్తంగా ఉంటాయి. అయితే దీన్ని మితంగా వాడటం మంచిది.

ముందడుగు
శుక్రవారం, 30-08-2024, హైదరాబాద్

# రూ.7300 కోట్ల సంపదతో..
# హురున్ రిచ్ లిస్టులో షారూక్ ఖాన్

న్యూఢిల్లీ: హురున్ సంపన్నుల జాబితాను రిలీజ్ చేశారు. ఆ జాబితాలోకి బాలీవుడ్ స్టార్ షారూక్ ఖాన్ ఎంట్రీ ఇచ్చారు. షారూక్ ఆస్తులు 7300 కోట్లు ఉంటుందని హురున్ తన జాబితాలో పేర్కొన్నది. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్మెంట్‌తో పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ లో షారూక్‌కు భాగస్వామ్యం ఉన్నది. కోల్‌కతా జట్టు ఈ ఏడాది ఐపీఎల్ గెలిచిన విషయం తెలిసిందే. షారూక్ సంపద పెరగడానికి ఇది కీలకమైంది.

ఎక్స్ అకౌంట్‌లోనూ షారూక్‌కు ప్రత్యేక స్థానం ఉన్నది. అతనికి ఎక్స్‌లో 44.1 మిలియన్ల ఫాలోవర్లు ఉన్నారు. అనేక మంది బిలియనీర్లు, సెలబ్రిటీలను అతను దాటేశాడు. సెలబ్రిటీల్లో బాలీవుడ్ నటి జూహీ చావ్లా కూడా హురున్ సంపన్నుల జాబితాలో చోటు సంపాదించింది. ఆమె సంపద 4600 కోట్లుగా ఉంది. హృతిక్ రోషన్ ఆస్తి సుమారు రెండు వేల కోట్లుగా ఉన్నది. కోల్‌కతా జట్టులో షారూక్‌తో పాటు చావ్లా వ్యాపార భాగస్వామిగా ఉన్నది. హృతిక్ రోషన్‌కు హెచ్‌ఆర్‌ఎక్స్ బ్రాండ్ ఉంది.
హురున్ లిస్టులో అమితాబ్ నాలుగో స్థానంలో ఉన్నాడు. అతని సంపద 1600 కోట్లుగా ఆ లిస్టులో చూపించారు. డైరెక్టర్ కరణ్ జోహార్ సంపద 1400 కోట్లు. హురున్ ఇండియా రిచ్ లిస్టు ప్రకారం.. భారత్‌లో 1539 మంది వెయ్యి కోట్ల కన్నా ఎక్కువ కలిగి ఉన్నారు. హురున్ సంపన్నుల జాబితాలో వ్యాపారవేత్త గౌతం అదానీ అగ్ర స్థానంలో నిలిచారు. అతని సంపద 11.6 ట్రిలియన్లుగా ఉంది.





# హ్యాపీ బర్త్‌డే కింగ్..
## 'కుబేర' నుంచి నాగార్జున స్పెషల్ పోస్టర్

తమిళ నటుడు ధనుష్ కథానాయకుడిగా రూపొందుతోన్న తాజా చిత్రం 'కుబేర'. ఆనంద్, గోదావరి, హ్యాపీడేస్, ఫిదా, లవ్‌స్టోరీ వంటి బ్లాక్ బస్టర్‌లు అందుకున్న శేఖర్ కమ్ముల ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తుండగా.. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తుంది. అయితే ఈ సినిమాలో టాలీవుడ్ అగ్ర నటుడు అక్కినేని నాగార్జున ప్రత్యేకపాత్ర పోషిస్తున్నారు. అయితే నేడు నాగార్జున పుట్టినరోజు. ఈ సందర్భంగా కుబేరా టీం విషెస్ తెలుపుతూ.. కుబేర మూవీ నుంచి నాగార్జున కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో హ్యాపీ బర్త్‌డే కింగ్ అంటూ చిత్రబృందం రాసుకొచ్చింది. ఈ పోస్టర్ చూస్తే.. కింగ్ ఎవరికో హైఫై ఇస్తున్నట్లుగా పోస్టర్ ఉంది. సునీల్ నారంగ్, పుస్కుర్ రామ్మోహన్‌రావు కలిసి నిర్మిస్తున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, కెమెరా: నికేత్ బొమ్మి, నిర్మాతలు: సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్‌మోహన్‌రావు.